క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పలు ఫీడర్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గగన్‌పహాడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గగనపహాడ్ ఇండస్ట్రియల్‌ఏరియా, బీతు, హనుమాన్ ఆలయం జల్‌పల్లి, జల్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియా, రెక్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమిళనాడు హోటల్ లెన్, ఏకేఆర్ పెట్రోల్‌బంక్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు ప్రజాభవన్ పనులు ప్రారంభం

మణికొండ: పేద ప్రజలు శుభకార్యక్రమాలు నిర్వహించుకునేలా ఉపయోగపడే ప్రజాభవన్ నిర్మాణ పనులను ఆదివారం మంచిరేవులలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మంచిరేవుల గ్రామస్తులతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి

అత్తాపూర్: నేరాలను నియంత్రించేందుకోసం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి వెల్లడించారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 70 మంది రౌడీషీటర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీల ఆదేశాల మేరకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌లు చేపడుతున్నామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. రౌడీషీటర్లంతా పోలీసులకు సహకరిస్తూ మంచితనంగా మెలగాలన్నారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మణికొండ: రాజేంద్రనగర్ కోర్టు నందు ఈనెల 9వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్ కొనసాగుతుందని, డ్రంకన్ డ్రైవ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారు దాన్ని సద్వినియోగం చేసుకుని తమపై ఉన్న కేసులను తొలగించుకోవాలని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అలాంటి వారు తమ ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సు, 2 జిరాక్స్‌లు, ఆధార్‌కార్డ్ 2 జిరాక్స్‌లు, వాహనం ఆర్‌సీ 2 జిరాక్స్‌లు తీసుకుని నార్సింగిలోని తమ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు ఉదయం 7గంటలకు రావాలన్నారు. అలా వచ్చిన వారి చార్జిషీట్‌లు సిద్ధం చేసి అదేరోజు కోర్టులో హాజరుపరచి తక్కువ జరిమానాతో జైలు శిక్షలు లేకుండా కేసును ముగించుకోవచ్చని ఆయన సూచించారు.

ఎన్‌ఎస్‌యూఐ నాయకుల నిరాహార దీక్ష



రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును మానుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు దుద్దు ప్రణయ్ వెల్లడించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నియోజకవర్గం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. బుద్వేల్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాతూ.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి సూచన మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 25 వేలతో మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్, షాబుద్దీన్, సదాలక్ష్మి, ఖలీద్, ప్రభాకర్‌రెడ్డి, ధనుంజయ్, సాయిగౌడ్, సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి కేసీఆర్ కృషి

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తూ డబుల్ బెడ్రూమ్‌ల పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొదటి దఫాలో 500 మందికి పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని కార్ధనూరులో నిర్మించిన డబుల్ బెడ్రూమ్‌లను శనివారం మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ విజయవంతంలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకే దక్కుతుందన్నారు. గతంలో ఆడబిడ్డలకు పెళ్లిలు చేసేందుకు తల్లిదండ్రులు అప్పులు చేసేవారని ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేస్తున్న షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలతో పేదోళ్లింట్లో పెద్దన్నగా నిలిచారన్నారు. హైదరాబాద్ మహానగరంలో పేదోడి సొంత ఇంటి కల సాకారం చేస్తూ ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల బ్యాంకు రుణాలను కూడా మాఫీ చేసి పేదలను ఆదుకున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని అలాంటి గొప్ప నాయకుడిని మనం మర్చిపోవద్దని, ఇలాంటి ఎన్నో అద్భుతమైన పథకాల రూపాకల్పనా అయన సొంతమని రానున్న రోజుల్లో ఇలాంటి పథకాలా కోసం మరోసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకుందాన్నారు.

కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేదవారికి అండగా ఉంటారని మరోసారి నిరూపించారు. ఎన్నో ఏళ్ల నుంచి కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇలాంటి సమయంలో భగవంతుడి లాగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చారు. ఆయనకు తాము ఎప్పుడు రుణపడి ఉంటాం.

– వేముల నాగమణి,మధుబన్ కాలనీ

ఎన్నో ఏళ్ల కల నెరవేర్చిన కేసీఆర్..



సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందా అని ఎదురు చూశాం. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటిని నిర్మించుకునేందుకు కష్టపడి పని చేస్తున్నాం. అయినా పిల్లల చదువులు తదితర వాటికి తమ సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇళ్లు లేని పేద వారికి డబుల్ బెడ్రూమ్‌లు అందించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో తాము సైతం దరఖాస్తు చేసుకున్నాం. ఆ దేవుడి దయవల్ల మా సొంతింటి కల నెరవేరింది.

– పగడాల సుజాత, టీఎన్‌జీవోస్ కాలనీ, కాటేదాన్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్‌రావు

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని శ్రీ శారదాధామంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర శిశు మందిర బాలబాలికల జట్టు క్రీడా పోటీలు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పతకమూరి శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచి అంచెలంచెలుగా శిశుమందిరాల బాలబాలికలకు క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయిలో, జోనల్ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో కూడా విద్యా భారత ఖేల్ కూద్ పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ఉద్యోగులు తిరుపతిరావు, విద్యా భారతీ దక్షిణ మధ్యక్షేత్ర కోశాధికారి పసర్తి మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్యువుల గుర్తింపుపై ఒక్కరోజు వర్క్‌షాప్



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: భారత వ్యవసాయ రంగంలో భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన వంగడాల రూపకల్పనకు సానుకూలమైన జన్యువుల గుర్తింపు అన్న అంశంపై రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఈఏ సిద్దిఖి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు గుర్తించని జన్యువులను వైల్డ్ వెరైటీస్‌లో గుర్తించి వాటి లక్షణాలను అధ్యయనం చేయడం వల్ల వివిధ పంటల్లో ముఖ్యంగా వరి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుందని సూచించారు. జన్యుశాస్త్రంలో వచ్చిన ప్రస్తుత ఆధునిక బ్రీడింగ్ పద్ధతులను ఉపయోగించి వైల్డ్ వెరైటీస్ నుంచి ఉత్తమ లక్షణాలు కల్గిన ఇప్పటివరకు గుర్తించబడని వాటిని వెలుగులోకి తేవడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మహాపాత్ర మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు జరిపిన కృషి ఫలితంగా వరిలో 2-లైన్ బ్రీడింగ్ ద్వారా హైబ్రిడ్ రైస్‌లో పురోగతి సాధిస్తున్నామని అలాగే జన్యుపరమైన అవాల సంకర రకాలను రూపొందించగలుగుతున్నామన్నారు. మొత్తం 5 టెక్నికల్ సెషన్స్ 11 మంది శాస్త్రవేత్తలు వివిధ పంటల్లో జన్యుపరమైన అంశాలపై ప్రజెంటేషన్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘురామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, ఆర్ఎం సుందరం, దీపక్‌పటేల్, దుర్గారాణి పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాం



పనులను పరిశీలిస్తున్న సురేందర్‌రెడ్డి

అత్తాపూర్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మిద్దెల సురేందర్‌రెడ్డి వెల్లడించారు. అత్తాపూర్ ఇందిరాగాంధీ విగ్రహం నుంచి మైసమ్మ ఆలయం వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్తాపూర్ ఇందిరాగాంధీ విగ్రహం నుంచి మైసమ్మ ఆలయం వరకు రూ.20 లక్షలతో నూతన సీసీ రోడ్లను నిర్మించామన్నారు. గతంలో ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి నిధులను మంజూరు చేయించామన్నారు. ఆయన చొరవతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మిద్దెల సురేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్‌లో ఓటర్ జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరికారణ కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమాభాయ్ హాల్లాలే ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరికారణ కార్యక్రమంలో బీఎల్‌వోలతో కలిసి ప్రత్యేక క్యాంపెయినింగ్ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ నెంబర్ 241, 242, 243లలో ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. అర్హులందరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పాలాభిషేకం

శంషాబాద్: అన్ని వర్గాల ప్రజలతో పాటు ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి మేలు చేసే విధంగా సీఎం కేసీఆర్ నిర్ణయాలుంటాయని జెడ్పీటీసీ సభ్యురాలు నీరటి తన్వీరాజు అన్నారు. వీఏఓల వేతనాల పెంపుతో పాటు యునిఫాంల ఖర్చు, జీవిత బీమా సంబంధిత అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన కారణంగా శనివారం పట్టణంలోని ఆమె నివాసం వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఏఓలు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ తన్వీరాజు, వీఏఓలు

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

అత్తాపూర్: అర్హులందరూ ఓటరు నమోదు చేసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ వెల్లడించారు. శనివారం పోలింగ్ స్టేషన్ 317, 318, 319లలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రజలకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే తప్పొప్పులు ఉంటే వాటిని సరి చేసుకోవాలన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సత్యగౌర చంద్ర దాస ప్రభూజీ

మణికొండ: నార్సింగిలో నిర్మించనున్న హరే కృష్ణ హెరిటేజ్ టవర్ సముదాయంలో ఈనెల 7న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభూజీ కోరారు. శనివారం నార్సింగిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తమ సంస్థ తరఫున బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని ఆలయంలోనే నిర్వహించామని, ఈ సంవత్సరం అక్కడతో పాటు నార్సింగిలోనూ నిర్వహిస్తున్నామన్నారు. బంజారాహిల్స్‌లో 6,7 తేదీలలో నిర్వహిస్తుండగా నార్సింగిలో 7న నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7.15 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు స్వామి వారిని దర్శనం చేసుకోవచ్చన్నారు. ఉత్సవాల్లో భాగంగా పిల్లలకు హరేకృష్ణ హెరిటేజ్ పోటీలు, శిక్షణ, గీతా శ్లోకం, చిత్రలేఖనం, వేషధారణ, ఉట్టి కొట్టడం కార్యక్రమాలను ఉదయం 9గంటల నుంచి 11.30 వరకు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రత్యేకంగా తయారు చేసిన 56 రకాల నైవేద్యం, రాజభోగ హారతులు ఉంటాయన్నారు. రోజంతా భగవద్గీత పారాయణం, శ్రావ్యమైన సంకీర్తన ఆలాపనలు ఉంటాయన్నారు. రాత్రి 8.30 గంటలకు రాధాకృష్ణుల మహాభిషేకం, అనంతరం మందిర అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ ప్రవచనం, అర్ధరాత్రి మంత్రముగ్ధమైన మహా మంగళ హారతి, భజనలు, సంకీర్తనలతో వేడుకలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలకు 20వేల మంది హాజరవుతారని భావించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీకొన్న స్కూలు బస్సు: యువకుడి మృతి



రమేష్(ఫైల్)

శంషాబాద్ రూరల్: బైక్‌ను ఎదురుగా వచ్చిన స్కూలు బస్సు ఢీకొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ఎర్రకుంటతాండా వాసి వరోత్య రమేష్(20) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం తండా నుంచి బైక్‌పై రమేష్ తన అక్క పిల్లలను పెద్దషాపూర్‌లో ఉన్న ఓ ప్రయివేటు స్కూలుకు తీసుకెళ్లి దింపాడు. తిరిగి బైక్‌పై తండాకు వస్తుండగా.. పెద్దషాపూర్ గ్రామంలోని వీకర్‌సెక్షన్ కాలనీలో ఎదురుగా వచ్చిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్కూలుకు చెందిన బస్సు ఇతని బైక్‌ను ఢీకొంది. దీంతో రమేష్ బస్సు చక్రాల కింద పడగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

TELANGANA GRAMEENA BANK | Narsingi Branch

PUBLIC NOTICE FOR AUCTION

It is proposed to sell by public auction the following ornaments pledged with Bank as security for advance made to one/several of its constituents:

S. No.	Account No.	Name	Loan Date	Ornaments	Gross Weight
1	79067367568	Shivagandla Swaroopa	11-04-2022	Gopithadu-1; Vanku-1; Baluvu-1	25.25 Grams

The auction sale shall be conducted at the premises of the branch on **11-09-2023 at 3.00 p.m.** and shall be decided in favour of higher bidder. The bidder will have to deposit the entire amount of the bid immediately on its acceptance by the Bank. The bank however, reserves to itself the right to cancel the auction and/or postpone or reject the bid in its absolute discretion. Sd/- Branch Manager, TGB, Narsingi

మంత్రి హరీష్‌రావుకు వినతి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సమస్యలపై మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రాన్ని అందించామని సైబరాబాద్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరామన్నారు. గతంలో ఉద్యమ సమయంలో హామీ ఇచ్చారని తెలిపారు.

100 ఫీట్ల రోడ్డు.. కమింగ్ సూన్



బండ్లగూడ: సినిమాలకు, సిరియల్స్‌కు ప్రచారం నిర్వహించేలా హెచ్‌ఎండీఏ అధికారులు సైతం వినూత్నంగా ఆలోచించి ప్రచార బోర్డులను ఏర్పాటు చేశారు. వీటిని చూసిన ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ స్వామి వివేకానంద విగ్రహం నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు 100 అడుగల రోడ్డు కోసం గతంలో హెచ్‌ఎండీఏ అధికారులు సర్వే నిర్వహించారు. అందుకు అనుగుణంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసింది. ఈ రోడ్డు పనులను త్వరలో చేపడతామని అధికారులు వెల్లడించారు. వివిధ కారణాలతో ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోయాయి. శనివారం హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో 100 ఫీట్ రోడ్ కమింగ్ సూన్ అంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ బోర్డులు చూసిన ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న సర్పంచు చంద్రశేఖర్

శంషాబాద్ రూరల్: జీవిత బీమా బాధితుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పెద్దషాపూర్ సర్పంచు చంద్రశేఖర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలి కుటుంబసభ్యులకు సర్పంచు చేతుల మీదుగా శనివారం బీమా డబ్బుల చెక్కును అందజేశారు. పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు సర్పంచు తన సొంత ఖర్చులతో జీవిత బీమా చేయించారు. కార్మికురాలు కొమ్మగళ్ల యాదమ్మ నాలుగు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె కుటుంబానికి రూ.20 లక్షల బీమా డబ్బులు రాగా.. ఈ చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు చెక్కల ఎల్లయ్య, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ గౌస్‌పాషా, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

అత్తాపూర్: భర్తతో గొడవపడి గృహిణి అదృశ్యమైన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వాసుదేవరెడ్డినగర్‌కాలనీలో సునల్ వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. అతడికి భార్య నందిని(37), ముగ్గురు పిల్లలు సంతానం. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 15న మరోసారి డబ్బుల విషయంలో గొడవ జరిగింది. నందిని 16న ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహానేతకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్‌ఆర్‌టీపీ నేతలు



బుద్వేల్‌లో.. కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్: పేద ప్రజల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎనలేని కృషి అందజేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్లడించారు. వైఎస్సార్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. బుద్వేల్ చౌరస్తాలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, ధనుంజయ్‌రెడ్డి, మహమ్మద్ ఖాలేద్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మహ్మద్ తాజుద్దీన్, సతీష్, సతీష్‌యాదవ్, గౌస్‌భాయ్, సదానందం, హరి తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లిలో...

వైఎస్సార్ వర్ధంతిని శనివారం శివరాంపల్లిలో నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, సదాల వెంకట్‌రెడ్డి, బద్దం శ్రీకాంత్‌రెడ్డి, మోహన్ రావు, పి.జీవన్‌దాస్ పాల్గొన్నారు.

పేద వర్గాల ఆశాజ్యోతి వైఎస్సార్..

పేద వర్గాల ఆశాజ్యోతి వైఎస్సార్ అని వైఎస్‌ఆర్‌టీపీ జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు వి.రాజగోపాల్, రాజేంద్రనగర్ యూత్ అధ్యక్షుడు సదాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయూబ్‌ఖాన్, శంషాబాద్ మండల అధ్యక్షుడు కోలన్ రాంరెడ్డి, గఫ్ఫార్‌ఖాన్ తదితరులున్నారు.

వెళాంగనీ కాలనీలో..

శంషాబాద్: వెళాంగనీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌టీపీ నాయకులు అక్రమ్‌ఖాన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు ఆయన అభిమానులు కూడా పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పడమటి శ్రీధర్‌రెడ్డి తదితరులు



వెళాంగనీ కాలనీలో..